క్లుప్తంగా

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ బి.ఆంజనేయ

కొత్తపల్లి: మండల వ్యవసాయాధికారి మహేష్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆత్మకూరు వ్యవసాయసహాయ సంచాలకులు ఆంజనేయ రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు భరోసా పేమెంట్ రిజెక్ట్ అయిన రైతులు త్వరగా ఆధార్ అప్డేట్ చేసుకుంటేనే నగదు పడుతుందన్నారు. పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులు త్వరగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్ర సిబ్బందికి మట్టి పరీక్ష సేకరణ యాప్ పై అవగాహన కల్పించి, మట్టి పరీక్షలు ప్రతి ఆర్బీకే నుంచి 25 చొప్పున ఆన్లైన్ విధానం ద్వారా సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటనారాయణ, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ పాస్టర్‌పై ఎస్పీకి ఫిర్యాదు

ఆత్మకూరురూరల్: కరివేన తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టరుగా పని చేసి సంఘపెద్దలచే తొలగించ బడ్డ ఓ. నీలాంబరం అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ రఘువీర్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు కరివేన తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ పెద్దలు బుధవారం తెలిపారు. అతను తమ సంఘంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అధికారులు, న్యాయస్థానాలకు తప్పుడు సమాచారమిస్తూ గ్రామంలో అశాంతికి కారణమవుతున్నాడని పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నూజివీడుకు చెందిన నీలాంబరం కరివేన తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్‌గా పని చేస్తు కర్నూలు పాలసమాజానికి, గ్రామ సంఘమునకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఫీల్డ్ కార్యవర్గ సభ్యులందరి ఏకగ్రీవ ఆమోదంతో సంఘం నుంచి శాశ్వతంగా బహిష్కరించడం జరిగిందన్నారు. సంఘ పెద్దలు నారాయణ, భూషన్న, జీవరత్నం తదితరులు ఉన్నారు.

అడిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి పని

కొత్తపల్లి: గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జాబుకార్డు కలిగి, అడిగిన ప్రతి కుటుంబానికి వెంటనే పనికల్పిస్తామని ఎంపీడీఓ మేరి తెలిపారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటికే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఇంకా ఎవరైనా పనికాల్సిన వారు డిమాండ్ పత్రం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా కూలీల సంఖ్య తగ్గకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలో హార్టికల్చర్ పంటల సాగుకు ఏఏ గ్రామాలలో రైతులు ముందుకు వస్తున్నారో వివరాలు సేకరించి సాగుకు ఎస్టీమేషన్ వేసి,రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ షేక్.రేష్మ, ఈసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణపై శిక్షణ

ఆత్మకూరు:పట్టణంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం రైతు భరోసా కేంద్రం సిబ్బందికి మట్టి నమూనా సేకరణపై మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మట్టి నమూనా సేకరించి సాయిల్ హెల్త్ పోర్టల్‌లో రైతుల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. రైతు పొలంలో జియో ట్యాటాకింగ్ చేసి వర్షాధారంగా ఉన్న ఐదు ఎకరాల పొలానికి ఒక మట్టి నమూనా, నీటి పారుదల కింద ఉన్న పొలంలో రెండున్నర ఎకరాల్లో ఒక మట్టి నమూనా సేకరించాలని సూచించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రైతులు వారి పొలాల్లో ఎరువులు వాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ, వీఏఏలు, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

మహానంది: రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులను సిద్ధంగా ఉంచుకోవాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ సూచించారు. బండిఆత్మకూరు రైతు భరోసా కేంద్రంలో బుధవారం వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బండిఆత్మకూరు మండలంలో 280 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏఓ స్వాతి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

పాములపాడు: ప్రభుత్వ అనుమతుల్లేని విత్తనాలు రైతులకు విక్రయించరాదని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇస్కాల గ్రామంలో పురుగు మందులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. గ్రామాల్లో ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

పేదల ఇంట వెలుగులు

- ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- నందికొట్కూరు నియోజకవర్గంలో 30,858 మంది లబ్ధిదారులు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అన్ని వర్గాల ప్రశంసలు



జీ.వీరాపురం ఎస్సీ కాలనీలో విద్యుత్ వెలుగులో రేకుల షెడ్డు

నందికొట్కూరు: ఎన్నికల హామీలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేస్తూ వస్తోంది. అందులో భాగంగానే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగు దేశం పాలన హాయంలో 50 యూనిట్ల వరకే ఇచ్చినా 2019 సార్వత్రిక ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు 100 యూనిట్లకు పెంచారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత దానిని 200 యూనిట్లకు పెంచి ఎస్సీ, ఎస్టీలకు ఎంతో ఊరటనిచ్చారు. దీంతో ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్..

నిరుపేదల ఇంట ఉచిత విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఎస్సీ, ఎస్టీలకు వైఎస్ జగన్ ప్రభుత్వం జగ్జీవన్‌జ్యోతి స్కీమ్ కింద 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు ఎస్సీలు 1,65,462 మందికి గాను 1,49,405 మందికి, ఎస్టీలు చెందిన 17,053 మంది గాను 13,916 మంది గృహాలకు ఉచిత విద్యుత్ స్కీం కింద లబ్ధి పొందుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఉచిత విద్యుత్ అమలు చేయకపోగా బిల్లులు కచ్చితంగా చెల్లించాల్సిందేనంటూ విజిలెన్స్ అధికారులను ఉసిగొల్పేది. విద్యుత్ కనెక్షన్లు తొలగించడమే కాకుండ మరి కొందరికి అత్యధిక బిల్లులు వచ్చి కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడిన సంఘటనలు లేకపోలేదు.

నందికొట్కూరు నియోజకవర్గంలో లబ్ధిదారుల వివరాలు

మొత్తం ఎస్సీలు	- 30,790
ఉచిత విద్యుత్ పొందుతున్న లబ్ధిదారులు	- 28,226
మొత్తం ఎస్టీలు	- 2,929
లబ్ధిదారులు	- 2632

పేదలంటే వైఎస్సార్ కుటుంబానికి ప్రాణం



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి పేదలంటే ఎంతో ప్రాణం. అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నో సంక్షేమ పథకాలు అందించారు. వైఎస్సార్ వారసుడిగా వైఎస్ జగనన్న పేదల పట్ల చూపుతున్న ప్రేమానురాగాలకు మేమంతా అండగా నిలబడతాం. ఎస్సీ, ఎస్టీల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించిన సీఎం జగనన్న చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు.

– తలారి ఎర్రన్న జీ.వీరాపురం, కొత్తపల్లి మండలం

టీడీపీ హయాంలో బిల్లు కట్టలేదని కరెంటు కట్ చేశారు



తెలుగు దేశం ప్రభుత్వంలో కరెంటు బిల్లు కట్టలేదని కట్ చేశారు. రెండు బల్బులు, ఒక ఫ్యాన్ ఉన్న మా ఇంట్లో 50 యూనిట్లు వాడే అవకాశం లేదు. అన్యాయంగా బకాయిలు చూపించి వందలాది రూపాయలు బిల్లు చూపించి, కట్టలేదని కరెంటు తొలగించారు. సీఎం వైఎస్ జగనన్న మాకు ఉచితంగా 200 యూనిట్ల కరెంటు ఇచ్చి ఆతుకుంటున్నారు.

– వెంకటేష్ శాతనకోట గ్రామం, నందికొట్కూరు మండలం

నాలుగేళ్ల పాలనలో ఒక పైసా బిల్లు కట్టలేదు



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా ఒక పైసా కరెంట్ బిల్లు కట్టలేదు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మాకు ఉచిత కరెంట్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారు. ఉచిత కరెంట్ ఇచ్చిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– రమణ జూపాడుబంగ్లా మండల కేంద్రం

గంతలో కరెంటు బిల్లు భయముండేది



దేశంలో ఎక్కడ లేని విధంగా పేదలకు ఉచిత కరెంట్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారు. కరెంట్ బిల్లు కట్టలేని పరిస్థితి మాది. గతంలో నెల వచ్చేలోపు కరెంట్ బిల్లు భయం ఉండేది. ఇప్పుడు కరెంట్ బిల్లు కట్టాలనే భయం లేదు. గతంలో కరెంట్ బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్ చేశారు.

– రమణ ప్రాతకోట గ్రామం, పగిడ్యాల మండలం

నీట్‌లో మెరిసిన శబరీష్



శబరీష్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణం రాజావీధికి చెందిన చిత్రాల రమేష్ కుమారుడు చిత్రాల శబరీష్ నీట్‌లో 240 ర్యాంకు సాధించాడు. శబరీష్ మాట్లాడుతూ తన కోసం ఎంతో కష్టపడిన తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేందుకు శస్త్ర చికిత్సా వైద్యుడనవుతానన్నాడు. శబరీష్ తండ్రి రమేష్ పట్టణంలో కిరాణా వ్యాపారం నిర్వహిస్తున్నారు.

హజ్‌యాత్రకు పయనం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణం నుంచి హజ్‌యాత్రకు ముస్లింలు పయనమయ్యారని మదరాసా మదీనా తులూమ్ కమిటీ అధ్యక్షుడు ఎంఎ రషీద్ తెలిపారు. ఆత్మకూరు పట్టణం నుంచి హజ్‌యాత్రకు ప్రయాణాన్ని జెండా ఊపీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి 18 మంది హజ్ యాత్రకు వెళ్తున్నారన్నారు. హాజీలకు పట్టణ మదర్సాలో భోజనం వసతులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మదరాస కమిటీ పెద్దలు హజరత్ మౌలానా మూర్తుజా జాకీర్, ఆసీసాహెబ్, ఆఫీసాహెబ్ పాల్గొన్నారు .

దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్

మహానంది: ప్రతి ఒక్కరి మొబైల్స్‌లో దిశ యాప్ ఉండటం ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని మహానంది ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మహానంది మండలంలో దిశయాప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు పలువురి మొబైల్స్‌లో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ప్రయోజనాలు వివరించారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం దిశ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

సీఎం జగనన్న ఆశీస్సులతోనే పట్టణాభివృద్ధి



మారుతీనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతోనే పట్టణాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బైరెడ్డి నగర్‌లో కౌన్సిలరు కృష్ణవేణి ఆధ్వర్యంలో సీసీ రోడ్లకు చైర్మన్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కాలనీల అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్ర శాప్ చైర్మన్ రాష్ట్ర యువత విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లి పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు రూ. 16 కోట్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఆ నిధులతోనే అన్ని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు చాంద్‌బాషా, లాలు ప్రసాద్, చిన్నరాజు, అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుర్వ శ్రీను, బ్రహ్మయ్య, జగదీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



చెలిమిల్ల గ్రామంలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: సచివాలయ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరుపట్టీని పరిశీలించారు. సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రజలకు ఇప్పటి వరకుఅందించిన సేవలపై ఆరా తీశారు. అనంతరం జగనన్న కాలనీని సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడి త్వరిత గతిన నిర్మాణాలు పూర్తి చేయాలని వివరించారు. సర్పంచు కోట్ల చంద్రరెడ్డి, ఎంపీటీసీ సురేష్, ఏఈ హౌసింగ్ శివరామకృష్ణారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ సిబ్బందిచే సమావేశం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గోపీకృష్ణ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిచే సమావేశం నిర్వహించారు. అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ విమలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జవ్వాజి సుంకన్నగౌడు సేవలు మరువలేనివి



జవ్వాజి సుంకన్నగౌడు విగ్రహానికి పూలమాల వేస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు

నందికొట్కూరు: జవ్వాజి సుంకన్నగౌడు సేవలు మరువలేనివని పురపాలక సంఘం చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో సుంకన్నగౌడు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జవ్వాజి సుంకన్న నందికొట్కూరు పంచాయతీకి మొదటి సర్పంచుగా పనిచేశారన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు దాదాపు 40 ఎకరాలు ఉచితంగా ధారదత్తం చేసిన ఘనత ఆయనకే దక్కిందని చెప్పారు. ఆయన వారసులు నేటికి పట్టణంలో అనేక సేవ కార్యక్రమాలు చేపట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు చాంద్‌బాషా, లాలు ప్రసాద్, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, ఆర్ట్ శ్రీను, కుర్వ శ్రీను, శాలిబాషా, శేఖర్, మధుసూదన్‌రెడ్డి, జవ్వాజి సుంకన్నగౌడు సేవ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మిడుతూరు: మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పత్తిపంటకి పిచికారీ చేసే పొడర్‌ను నీటిలో కలుపుకొని సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు తాటిపాటి రమణ, సుధారాణి దంపతులను.. అదే గ్రామానికి చెందిన తాటిపాటి రవి, అమ్మ రోజమ్మలు గొడ్డలితో నరుకుతానని, దుర్భషలాడుతూ మంగళవారం గొడవ పడ్డారు. వీడియోల ఆధారంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కాగా రమణ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, నీ కథ అవుతుందిలే అని రవిని బెదిరించడంతో బుధవారం ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడకి స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాటిపాటి రమణ, భార్య సుధారాణిల వేధింపులు తట్టుకోలేక ఘాతుకానికి పాల్పడ్డాడని రవి తల్లి రోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని కే.లక్ష్మికి నగదు అందజేస్తున్న సర్పంచ్ సుజాత

పగిడ్యాల:మూడు దశాబ్దాల కాలంలో ఏ ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే విద్యకు పెద్దపీట వేసి ప్రోత్సాహకాలు అందజేస్తోందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తన 30 ఏళ్ల సర్వీసులో విద్యకు నిధులు ఖర్చుచేసిన ముఖ్యమంత్రులను చూడలేదన్నారు. జగనన్న ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఒక్కతరం కష్టపడి చదివి ఉద్యోగాల్లో చేరితే భవిష్యత్ తరాలు కూడా బాగుపడుతాయని విద్యార్థులను ఉత్తేజపరిచారు. అనంతరం పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వరుసగా రూ. 3 వేలు, రూ.2 వేలు, రూ. 1 వెయ్యి చొప్పున నగదు పారితోషికాలను లక్ష్మాపురం సర్పంచ్ సుజాత చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన జగనన్న

- జగనన్న కాలనీల్లో అన్ని వసతులు కల్పిస్తాం
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



జగనన్న కాలనీలో నూతన బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: పేదవాడికి సొంత ఇల్లు అన్నది ఒక మధుర స్వప్నమని అది నేడు ప్రతి ఊర్లో జగనన్నకాలనీ రూపంలో అది సాకారమవుతోందని ఆ ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదేనని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. మండలంలోని కరివేన గ్రామంలోని జగనన్న కాలనీని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువలు, మంచి నీరు, విద్యుత్ సరఫరా ఇతర సదుపాయాలు ఏమేమి కావాలో కల్పిస్తామని చెప్పారు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని అధికారులను ఆదేశించారు. ప్రధానంగ కాలనీల్లో నీటి సమస్య లేకుండా చూడాలని, అవసరమైతే పలు చోట్లు కొత్త బోర్లు వేయాలని ఆదేశించారు. అంతకు మునుపు జగనన్న గృహాలను పరిశీలించారు. గృహాలు త్వరగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అధికారులు బిల్లులు చెల్లింపులో జాప్యం చేస్తే నేరుగా తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని చెప్పారు. అనంతరం కాలనీలో నూతన బోరును ప్రారంభించారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా

మండలంలోని కరివేన గ్రామంలో ఎంపీపీ తిరుపాలమ్మ నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్ హాలులో ఎస్ తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శివ శంకర్‌నాయక్ సోదరుని కుమార్తె వివాహవేడుకలకు హాజరయ్యారు. నల్లకాల్వ గ్రామంలో రాంబాలాజీ నాయక్ నూతన గృహ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, కొండలరావు, రవినాయక్, సర్పంచ్ మాణిక్యమ్మ, నాగేశ్వరరెడ్డి, వరాల మాలిక్, కౌన్సిలర్ సుల్తాన్, విజయ్ చౌదరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరం



విద్యార్థులకు విద్యాకానుకలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, హెచ్ఎం

కొత్తపల్లి: జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరలాంటిదని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. పాఠశాలలోని 3 నుంచి 10 వతరగతి వరకు చదువుతున్న 409 మంది విద్యార్థులకు గాను 325 మందికి విద్యాకానుక కిట్లను పంపిణీ చేశామన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ



దామగట్లలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండల పరిధిలోని దామగట్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక అనేది ప్రతి పేద విద్యార్థులకు ఒక వరం లాంటిదని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతోనే జగనన్న ప్రభుత్వం విద్యార్థులు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏసురత్నం , వైఎస్సార్‌సీపీ నాయకులు పబ్బతి రవి, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జగనన్నవిద్యాకానుక విద్యార్థులకు వరం లాంటిదని జంగాలపేట ప్రాథమిక పాఠశాల పీఎంసీ కమిటీ చైర్మన్ మహేష్, హెచ్ఎం బషీర్‌అహమ్మద్ తెలిపారు. బుధవారం జూపాడు బంగ్లాలోని జంగాలపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు.

ఆధ్యాత్మికం

మోతుకూరులో ఆలయ జీర్ణోద్ధరణ



ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శిల్పా

వెలుగోడు:మోతుకూరు గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గతంలో ఆంజనేయస్వామి విగ్రహం ఉండగా గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించి బుధవారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఉత్సవ మూర్తి, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి పురోహితులు వేద పండితులతో ఆశీర్వాదాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, బోగోలు సుదర్శనం ఎమ్మెల్యేను సన్మానించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ కార్యక్రమాలు

వెలుగోడు: పట్టణంలోని విజయనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన గణపతి దేవాలయ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభంకాగా బుధవారం విగ్రహం, శిఖరం ప్రతిష్ఠించారు. గణపతి దేవాలయం నిర్మాణ, వ్యవస్థాపక, శాశ్వత ధర్మకర్త రామాపురం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై తూర్పుగోదావరికి చెందిన బాలాంత్రపు సుచిత్రమూర్తి, బృందం వారిచే నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమం పలువురు భక్తులను అలరించింది. కార్యక్రమంలో శివ శివ శంకర, ఓం శివోహం, శివశివ శంకర, శివాష్టకం, శివపంచాక్షరి, శంభో శివశంభో తదితర గీతాలను వసంత, మణిశ్రీ, లలిత, పవన్‌కుమార్ ఆలపించారు.

సాక్షిగణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణ పతి స్వామికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం , కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

బర్రెల మందపై పెద్దపులి దాడి

మహానంది: బండిఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామ పరిధిలోని తెలుగుగంగ ఎగువ పొలాల్లో మేతకు వెళ్లిన బర్రెల మందపై బుధవారం పెద్దపులి దాడి చేసింది. ఈ ఘటనలో ఓ బర్రె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పాదముద్రలను సేకరిస్తున్నట్లు సమాచారం.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట నర్సయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ రక్త దాన దినోత్సవాన్ని నిర్వహించారు.

బాధ్యతల స్వీకరణ

మిడుతూరు: మండల తహసీల్దార్‌గా ప్రకాష్ బాబు, డిప్యూటీ తహసీల్దార్‌గా షనవాజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వారికి ఆర్ఐ మహమ్మద్ హుశ్శేన్, గ్రామ రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు.

17న మందకృష్ణ మాదిగ రాక

మహానంది: ఈ నెల 17వ తేదీన ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బండిఆత్మకూరు మండలం పార్నపల్లెకు వస్తున్నట్లు ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ కత్తి ఓబులేసు మాదిగ తెలిపారు. పార్నపల్లెలో బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. టీటీడీ కల్యాణమండపంలో సమావేశం ఉంటుందన్నారు.

ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి



దశరథరామయ్యనును సన్మానిస్తున్న దృశ్యం

మిడుతూరు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరని, ఎక్కడ విధులు నిర్వహించిన పారదర్శకంగా, నిజాయితీగా పనిచేస్తే సమాజంలో గుర్తింపు వస్తుందని ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహించి పదోన్నతిపై నందవరం ఎంపీడీఓగా బదిలీపై వెళ్లిన దశరథరామయ్యను, సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పాములపాడు మండలానికి బదిలీపై వెళ్లిన చక్రవర్తిని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంగిల్‌విండో చైర్మన్ నాగతులసిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు నబిరసూల్, నాగలూటి సర్పంచ్ ఉషారాణి, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.